ఆన్‌లైన్ వల.. జేబులు గుల్ల..

- పెరిగిన సైబర్ మోసాలు
- కమీషన్ల పేరుతో మెసేజ్‌లు
- నమ్మించి మోసం
- విద్యావంతులే బాధితులు



ధవళేశ్వరం: సైబర్ కేటుగాళ్లు ట్రెండ్ మార్చారు. మొన్నటి వరకూ ఓటీపీలు, లింక్‌లు పంపి రూ.లక్షలు దోచుకున్న మోసగాళ్లు ఇప్పుడు ఆన్‌లైన్ వ్యాపారాలు అంటూ అధిక మొత్తంలో కమీషన్ ఆశ చూపుతూ సొమ్ములు స్వాహా చేస్తున్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసగాళ్ల బారిన పడి ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరు రూ.35 లక్షలు, మరొకరు రూ.11.85 లక్షలు పోగొట్టుకున్నారు. మోసపోయినట్లు గుర్తించిన అనంతరం లబోదిబోమంటూ పోలీసుల వద్దకు వచ్చారు. అయితే అనేక మంది రూ.వేలల్లో, మరికొందరు రూ.లక్షల్లో పోగొట్టుకుని బయటకు చెప్పుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ఎరవేస్తున్నారు

యూట్యూబ్ చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేయాలని తొలుత నమ్మబలుకుతున్నారు. అనంతరం కొన్ని గ్రూపుల్లో యాడ్ చేసి టాస్కలను ఇస్తున్నారు. తొలుత రూ.వెయ్యి పెట్టుబడి పెడితే 30 నుంచి 40 శాతం కమీషన్ వస్తుందంటూ నమ్మిస్తున్నారు. దీనికి అనుగుణంగానే తొలుత రూ.వెయ్యి వేసిన వారికి తిరిగి రూ.1400 వేస్తున్నారు. ఇది నమ్మిన కొందరు రూ.లక్షల్లో పెట్టుబడి పెడుతున్నారు. అనంతరం వీరి ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో మోసపోయినట్లు గుర్తించి లబోదిబోమంటున్నారు.

రూ.35,23,440 స్వాహా

ధవళేశ్వరం లక్ష్మీనరసింహ నగర్‌కు చెందిన వెల్నాటి శ్రీహరి రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. మే 14వ తేదీన అతడికి యూట్యూబ్ చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేయాలని వాట్సాప్ మేసేజ్ వచ్చింది. సబ్‌స్క్రైబ్ చేసిన అనంతరం రూ.5 వేలు వేస్తే 30 శాతం కమీషన్ ఇస్తామని నమ్మబలికారు. తొలుత శ్రీహరి పలు దఫాలు రూ.5 వేలు జమచేయగా అతడి అకౌంట్‌లో రూ.6,500 చొప్పున వేశారు. ఇది నమ్మిన ఆయన రూ.35,23,440 జమ చేశారు. అనంతరం అతడికి సొమ్ము తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించి ధవళేశ్వరం పోలీసులను ఆశ్రయించాడు.

రాజవోలులో..

రాజవోలు గ్రామంలో రమాదేవి గార్డెన్స్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాలా భానుప్రకాష్‌కు మే 30న గూగుల్ మ్యాప్‌లో రివ్యూస్ ఇస్తే డబ్బులు వేస్తామంటూ వాట్సాప్ మెసేజ్ పంపారు. అనంతరం గ్రూపులో యాడ్ చేసి 40 శాతం కమీషన్ ఇస్తామని చెప్పడంతో భానుప్రకాష్ రూ.2 వేలు వేయగా అతడికి రూ.2800 తిరిగి పంపించారు. దీంతో నిజమే అని నమ్మిన భానుప్రకాష్ రూ.11.85 లక్షలు వేశారు. వారి వద్ద నుంచి తిరిగి ఏవిధమైన సొమ్ము రాకపోవడంతో ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇలా అనేక మంది ఈ మోసగాళ్ల మాటలు నమ్మి కష్టపడిన సొమ్ము పోగొట్టుకుంటున్నారు. బాధితుల్లో ఎక్కువమంది విద్యావంతులు కావడం గమనార్హం.

అప్రమత్తంగా ఉండండి



పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్‌లో పెట్టుబడులు అంటూ వస్తున్న మెసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలి. గుర్తుతెలియని నంబర్ల వచ్చిన లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దు. అధిక కమీషన్ ఇస్తామంటూ వస్తున్న ప్రకటనపై జాగ్రత్తగా ఉండాలి. ఎటువంటి అనుమానం వచ్చినా పోలీసులకు వెంటనే సమాచారం అందించండి.

– కె.మంగాదేవి, ధవళేశ్వరం సీఐ

క్లుప్తంగా

సంహితలో జాబ్‌మేళా



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

ప్రకాశం నగర్: స్థానిక తాడితోట సంహిత కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో గురువారం ప్రభాకర్ నిధి లిమిటెడ్ జాబ్ మేళా జరిగింది. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కాగా.. ఎగ్జిక్యూటివ్స్, టెలీకాలర్స్, డేటా కలెక్షన్ ఏజెంట్లు, కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో యాంకర్ చోటు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలశాఖ కార్యాలయం మార్పు

ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని భూగర్భ జలశాఖ కార్యాలయాన్ని రాజమహేంద్రవరంలో నూతన భవనంలోకి మార్చినట్లు ఆశాఖ ఉపసంచాలకులు వై.శ్రీనివాస్ తెలిపారు. ఈ మార్పును ప్రజలు గమనించాలని కోరారు. రాజమహేంద్రవరంలోని ప్రశాంతి ఎస్టేట్స్ టైప్-వి/బి లోని ఇంటి నంబర్ 79-5-4/4 (బీఎస్ఎన్ఎల్ భవనం)లోకి మార్పుచేశామన్నారు.

పుస్తక పఠనంతో ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ విజయ శంకర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పుస్తక పఠనం తదితర మంచి అలవాట్లతో చెడు వ్యసనాలకు దూరంగా ఉండవచ్చని గవర్నమెంట్ రైల్వే ఇన్‌స్పెక్టర్ పి.విజయ శంకర్ అన్నారు. ఈనెల 26న ప్రపంచ మత్తుమందు నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆల్కాట్‌తోటలోని శ్రీనివాస రామానుజన్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ విజయ శంకర్ మాట్లాడుతూ ప్రతి రోజూ పాఠ్య పుస్తకాలతో పాటు న్యూస్ పేపర్లు, మోటివేషన్ బుక్స్ చదవడం, ఆటలు ఆడడం, తల్లిదండ్రులకు పనుల్లో సహాయ పడటం ద్వారా చెడు అలవాట్లకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఎస్సైలు లోవరాజు, మావుళ్లు, రవిబాబు, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పీకేఎస్ సత్యవతి పాల్గొన్నారు.

సున్నంబట్టీ వీధిలో చోరీ

ధవళేశ్వరం: స్థానిక సున్నంబట్టీ వీధిలో రాగాల మంగాదేవి ఇంట్లో నడుపుతున్న షాపులో గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. గల్లాపెట్టెలోని రూ.12 వేలు, 6 గ్రాముల విలువైన రెండు బంగారం ఉంగరాలు, వెండి బ్రాస్‌లెట్ దొంగతనం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ మంగాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ వార్షిక మరమ్మతులు నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ పలు గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ గురువారం తెలిపారు. కడియపులంక, వేమగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని కడియం మండలం వేమగిరి, జేగురుపాడు, కడియపుసావరం, కడియపులంక, బుర్రిలంక, పొట్టిలంక గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు.

భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు



వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న షర్మిలారెడ్డి

ప్రకాశం నగర్: ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. గురువారం స్థానిక గౌతమీ జీవకారుణ్య సంఘంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ సహకారంతో రినోవేషన్ చేయించిన జగనన్న ఎంఎస్ఆర్ ఐసీయూ కేర్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడి వృద్ధుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా వైద్యవిభాగాన్ని రినోవేషన్ చేయించి కావాల్సిన సౌకర్యాలు కల్పించామన్నారు. రెండు ఆక్సిజన్ యూనిట్లు, రెండు ఏసీలు, నాలుగు బెడ్లు, 6 సెలైన్ స్టాండ్లు, వృద్ధుల ఆరోగ్య పరిస్థితిని చూసుకునేందుకు కళాధర్ అనే వ్యక్తిని ఏర్పాటు చేయించామన్నారు. ఆశ్రమంలోని వృద్ధులకు సకాలంలో అన్ని వైద్య సేవలందించామన్నారు. ఐసీయూ కేర్ తమను సంజీవనిలా ఆదుకుందని వృద్ధులు చెబుతుంటే సంతోషంగా ఉందన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు

- కలెక్టర్ మాధవీలత
- గోపాలపురం నియోజవర్గంపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్, గోపాలపురం ఎమ్మెల్యే వెంకటరావు

సీటీఆర్ఐ: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద అర్హత కలిగిన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మండల అధికారులకు కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం గోపాలపురం నియోజకవర్గంలో హౌసింగ్, జగనన్న కాలనీలు, ఇళ్ల స్థలాలపై పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పాల్గొన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఎస్‌పీఐ 90 రోజుల కార్యక్రమం, గడప గడపకూ మన ప్రభుత్వం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కేటాయింపు వేగవంతం చేయాలన్నారు. గోపాలపురం మండలంలో 1,149కి గాను 1,043 ఇళ్లు, దేవరపల్లిలో 2,944 గాను 2,461, నల్లజర్లలో 2,016 గాను 1,046 గ్రౌండింగ్ అయ్యాయన్నారు. ఇంకా నియోజకవర్గం పరిధిలో 1,559 ఇళ్ల కేటాయింపులు జరగాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వ భూమి, భూసేకరణ ద్వారా 55.41 ఎకరాలను గుర్తించాల్సి ఉందన్నారు. జగనన్న కాలనీల్లో తాగునీరు, రహదారుల నిర్మాణం, భూముల పెండింగ్ లెవిలింగ్ పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు దీనికి సంబంధించిన నివేదికలు సిద్ధం చేసి, వచ్చే బుధవారానికి రావాలన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో 4బీ సర్వే కోడ్స్ కింద 263 స్థలాలు, మ్యాపింగ్ కింద 93, జియో ట్యాగింగ్ కింద 75 పూర్తి చేయాల్సి ఉందన్నారు. నల్లజర్ల 1, 2, ఆవపాడు, చోడవరం, దూబచర్ల 1, ముసల్లంక, ప్రకాశరావు పాలెం, సుభద్ర పాలెం తదితర గ్రామాల్లో ఇళ్ల స్థలాల కోసం పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించి, స్థలాల కేటాయింపులు జరపాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీవో ఎస్.మల్లిబాబు, జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా నవరత్నాల వెలుగులు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- శాటిలైట్ సిటీలో గడపగడపకూ..



శాటిలైట్‌సిటీలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని, నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు నిండాయని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. శాటిలైట్ సిటీ గ్రామ సచివాలయం -3 పరిధిలోని బిబ్లాకులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చందన నాగేశ్వర్, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు బిబ్లాక్, గోపాలకృష్ణ నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని తెలియజేస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు ఎటువంటి ఆధారం లేదని ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని అర్జల కుమారి, ఏసమ్మ కోరారు. అలాగే తమ స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల ఇల్లు నిర్మించుకునేందుకు అనువుగా లేదని వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తమ వీధిలో వీధిలైట్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గోపాలకృష్ణ నగర్ వాసులు విన్నవించారు. స్పందించిన నాగేశ్వర్ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణకు సూచించారు.

జగన్ పాలనకు మద్దతు

చందన నాగేశ్వర్ మాట్లాడుతూ జగనన్న పాలనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో ఫ్యానుగాలికి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. రాష్ట్రంలో కులమతాలు, పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు సఫారి నాయుడు, సచివాలయం -3 కన్వీనర్లు రుంకాని రమణమ్మ, బత్తిన అప్పారావు, పుచ్చా గోవిందరెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు బొమ్ము శ్రీను, కడవకొల్లు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు, రుంకాని రవి, పగడం లక్ష్మణరావు, పుచ్చా ప్రసన్నకుమార్‌రెడ్డి, ధర్మవరపు శ్రీనివాస్, దత్త సాయి, సుబ్బు, మనోహర్, ప్రతాప్, మిరియాల మల్లేష్ పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్



సమీక్ష నిర్వహిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

రాజమహేంద్రవరం సిటీ: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశించారు. రాజమహేంద్రవరం విద్యుత్ భవన్‌లో గురువారం రాజమహేంద్రవరం అధికారులతో సమీక్షించారు. ఎనిమిది ఆపరేషన్ డివిజన్ల వారీగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లతో మాట్లాడారు. ఆయా డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, విద్యుత్ రెవెన్యూ వసూలు, సరఫరా అంతరాయాలు, జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులు, వినియోగదారుల సేవలు, 1912 ద్వారా వచ్చిన ఫిర్యాదులు, పెండింగ్‌లో ఉన్న సబ్‌స్టేషన్ నిర్మాణ పనులపై సమీక్షించి పలు సూచనలు చేశారు. రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ల విభాగం, మీటర్లు, ప్రొటెక్షన్, విజిలెన్స్, కన్‌స్ట్రక్షన్, డిస్ట్రిక్ట్ స్టోర్స్, బొమ్మూరు పని తీరుపై ఆరా తీశారు. సమావేశంలో ఉన్నతాధికారులు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఏపీ సూర్య ప్రతాప్, చీఫ్ జనరల్ మేనేజర్లు ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

వేపకాయలదిబ్బలో విద్యుత్ సబ్‌స్టేషన్

- మంజూరు చేసిన మంత్రి పెద్దిరెడ్డి
- ఎమ్మెల్యే రాజా వినతిపై సానుకూల స్పందన



అమరావతిలో మంత్రి రామచంద్రారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



మంత్రి విడదల రజనీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజా

సీతానగరం: రాజానగరం మండలం దివాన్ చెరువు పంచాయతీలోని వేపకాయలదిబ్బలో కొత్తగా 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. గురువారం అమరావతి వెళ్లిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు విషయమై చర్చించారు. దీంతో సబ్‌స్టేషన్ మంజూరు చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో దీని నిర్మాణం జరగనుంది. కాగా.. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అమరావతిలో పలువురు మంత్రులను కలిశారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)గా మార్పు చేస్తూ ఇటీవల రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీని ఎమ్మెల్యే రాజా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను కలుసుకున్నారు. న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) నిధులతో నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ రోడ్ల నిర్మాణ పనులు నెమ్మదించాయని మంత్రికి నివేదించారు. వాటిని వేగవంతం చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు.

కోరుకొండ భూములకు రిజిస్ట్రేషన్ కల్పించండి

మధురపూడి: కోరుకొండలోని భూములకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని వైఎస్సార్ సీపీ నాయకులు, భూపోరాట సమితి నాయకులు గురువారం కలెక్టర్ మాధవీలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భూములకు రిజిస్ట్రేషన్ హక్కు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. వివాహాలు, శుభ కార్యక్రమాలు, ఇతర అవసరాలకు ఆస్తులను విక్రయించుకునే అవకాశం లేదన్నారు. దీంతో సొంత స్థలం ఉన్నప్పటికీ అప్పుల పాలవుతున్నట్టు వాపోయారు. వివరాల్లోకి వెళితే.. కోరుకొండలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూములు కోరుకొండ తదితర గ్రామాల్లో ఉన్నాయి. వీటి రిజిస్ట్రేషన్ కోసం కోరుకొండ వాసులు పలు ఉద్యమాలు నిర్వహించారు. ఈ సమస్య పరిష్కారానికి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రయత్నాలు చేస్తున్నారు. దానిలో భాగంగా కొంత భూమికి రిజిస్ట్రేషన్ అవకాశం వచ్చింది. ఇదిలా ఉండగా కోరుకొండలోని భూములకు రిజిస్ట్రేషన్ కల్పించాలన్న డిమాండ్ మేరకు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదేశాల్లో భాగంగా ఈ వినతిపత్రాన్ని అందజేశారు. దీనికి కలెక్టర్ మాధవీలత సానుకూలంగా స్పందించారు. ఆమెను కలిసిన వారిలో భూ పోరాట సమితి నాయకుడు డాక్టర్ కుంచే వెంకటరమణ, గ్రామ ఉప సర్పంచ్ నేతుల చిన్ని, ఎంపీటీసీ కాళ్ల వీరబాబు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు అయిల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, వాకా నరసింహారావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: ఆపదలో ఉన్నవారిని సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఆదుకుంటోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మల్లంపూడికి చెందిన సంగుల తమ్మారావు ఇటీవల హైదరాబాద్‌లో కిడ్నీ ప్లాంటేషన్ చేయించుకున్నాడు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ద్వారా ప్రభుత్వ సాయాన్ని కోరడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.4.50 లక్షలు మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కును రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో తమ్మారావుకు విజయలక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొర పాల్గొన్నారు.

బంగారం మాయం

కంబాలచెరువు: ఆల్కాట్‌గార్డెన్స్ రైల్వే క్వార్టర్స్‌లోని ఒక ఇంటిలో రూ.20 గ్రాముల బంగారు నగలు చోరీకి గురైన సంఘటనపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న కల్పన ఈనెల నాలుగో తేదీన వేరే ప్రాంతానికి వెళ్లింది. తిరిగి ఈనెల 21న ఇంటికి వచ్చి చూసేసరికి తలుపు తెరిచి ఉంది. లోపలకు వెళ్లి చూడగా బీరువాలో నగలు అపహరణకు గురయ్యాయి. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రంగంపేట: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) సీఐ జి.వెంకటలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత జీవితంలో లక్ష్యం ఏర్పరచుకుని దాని సాధనకు కృషి చేయాలని చెప్పారు.

సాక్షి-సినిమా



శ్యామల :	మనుచరిత్ర
సూర్యమినీ :	భీమదేవరపల్లి బ్రాంచ్
సూర్యప్యాలెస్ :	ఆదిపురుష్
స్వామి :	బిచ్చగాడు-2
శివజ్యోతి :	అశ్విన్స్
అనుశ్రీ :	ఆదిపురుష్
రాజా :	ఆదిపురుష్
అశోక :	ఆదిపురుష్
ఊర్వశి :	విమానం
రంభ :	1920
మేనక :	భారీ తారాగణం, కథ వెనుక కథ
అప్సర :	డిష్లాష్
నామవరం	
వీఎస్ మహల్ :	ఆదిపురుష్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	ఆదిపురుష్
కడియం	
వెంకటసూర్య :	ఆదిపురుష్

శభాష్ విజయలక్ష్మి



దొరికిన బంగారం, నగదును పోలీసుల సమక్షంలో దివ్యకు అప్పగిస్తున్న విజయలక్ష్మి

కంబాలచెరువు: తనకు దొరికిన బంగారం, నగదును పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకుంది ఓ మహిళ. వివరాల్లోకి వెళితే.. పశ్చిమగోదావరి జిల్లా ధర్మవరానికి చెందిన మరమట్ల దివ్య ఈనెల 21న దుస్తులు కొనుగోలు చేసేందుకు రాజమహేంద్రవరం వచ్చింది. అయితే ఆమె పర్సు ఎక్కడో పడిపోయింది. దీంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. అప్పటికే రాత్రి కావడంతో మర్నాడు ఉదయం రావాలని పోలీసులు చెప్పారు. దీంతో తిరిగి గురువారం ఉదయం ఆమె వచ్చింది. అదే సమయానికి బర్మాకాలనీకి చెందిన విజయలక్ష్మి ఆ పోలీస్ స్టేషన్‌కు వచ్చింది. తనకు పర్స్ దొరికిందని, అందులో నాలుగు బంగారు రింగులు, రూ.11 వేలు ఉన్నాయని పోలీసులకు అందజేసింది. సీఐ లక్ష్మణరావు వెంటనే పర్స్‌ను తీసుకుని బాధితురాలు పేర్కొన్న వస్తువులు అన్నీ అందులోనే ఉండడంతో వాటిని దివ్యకు అప్పగించారు. విజయలక్ష్మి నిజాయితీని అభినందించారు.

బాలుడి అదృశ్యం



ఏబ్రహేమ్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: లాలాచెరువు పోలీస్ క్వార్టర్స్ వెనుక బాలాజీ నగర్‌కు చెందిన 14 ఏళ్ల గడసాల ఏబ్రహేమ్ వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బంధువులు, చుట్టుపక్కల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి శామ్యూల్ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై జగన్‌మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ 94407 96533, ఎస్సై జగన్‌మోహన్ 98660 63391 నంబర్లకు సమాచారం ఇవ్వగలరు.

సారాతో ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో నార్త్‌స్టేషన్ సిబ్బంది గురువారం తొర్రేడులో దాడి చేశారు. ఈ సందర్భంగా మచ్చా శేఖర్, మచ్చా చంటిని అరెస్టు చేసి, వారి నుంచి తొమ్మిది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు.

డిజిటల్ బోధనపై అవగాహన అవసరం



డిజిటల్ విధానంలో పాఠాలు బోధిస్తున్న డీఈఓ అబ్రహం

రాజానగరం: విద్యార్థులకు డిజిటల్ విధానంలో పాఠాలు బోధించే విధానంపై ఉపాధ్యాయులు పూర్తి అవగాహన పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన బ్లాక్ బోర్డు, గ్రీన్ బోర్డులతో అవసరం లేకుండా స్మార్ట్ టీవీపైనే ప్రత్యేక పెన్‌తో అక్షరాలు రాస్తూ, డిజిటల్ విధానంలో పాఠాలు బోధించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విధానంలో విద్యను బోధించడం హర్షణీయమన్నారు. ఈ విధానంలో విద్యార్థులకు తలెత్తే వివిధ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసేలా పూర్తి అవగాహనను పెంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ విధానాన్ని పరిశీలించారు.